# ఒక దెబ్బకు రెండు పిట్టలు

— బి. రఘురామరాజు

"నువ్వు పంపిన ప్రేమలేఖ ఇవ్వబోయి, ఆ సుజాత చేతిలో నడిరోడ్డు మీద చెప్పు దెబ్బలు తిన్నానురా బాబు!" చెంప నిమురుకుంటూ అన్నాడు వినయ్.

"అసలేం జరిగిందో పూర్తిగా ఏడువ్!" కసురుకున్నాడు వసుధేశ్.

"కాలేజీ మెయిన్ గేట్ లోంచి సుజాత అలా బయటికొస్తుంటే, తక్కున వెళ్లి నువ్విచ్చిన లవ్ లెటరందించానురా. అంతే! ఒక్కసారి కళ్ళెర్ర జేసి, ఎడమకాలి చెప్పుతో రెండు లాగించింది. 'దమ్ముంటే ప్రేమలేఖ వాణ్ణే ఇవ్వమనరా, నడుమ నీలాంటి గాడిదలెందుకు అనవసరంగా!' అంటూ ఇంకా ఏమేమో కూసిందిరా. దెబ్బల మైకంలో అంతా మరచి పోయాను రా!" అంటూ వివరంగా చెప్పాడు వినయ్.

"కాలం కలిసి రావాలి. దాని అంతు చూసే దాకా వదలను. ఆగరా!" పళ్లు పటపట కొరుకుతూ అన్నాడు వసుధేశ్.

* * *

"కొంప మునిగింది! ఈ సారి నీంచి గోవిందా గోవింద!" వసుధేశ్ హాస్టల్ గదిలోకి అడుగు పెడుతూ అరిచాడు కార్తీక్.

"సంగతేమిటో చెప్పిచావరాదుట్రా!" చేతిలోని సిగరెట్ పీక బయటికి పారేస్తూ విరాగ్గా అన్నాడు వసుధేశ్.

"రెండేళ్ళనించి కాలేజీ యూనియన్‌కి ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికవుతున్నావని మీసాలు మెలివేసేవాడివిగా. ఇప్పుడు చూడు! ఆ సుమంత్ గాడు నీకు పోటీగా నామినేషన్ వేస్తాడట. వాడు నిలబడితే చాలు, నువ్వు ఓడిపోవడం తప్పదు". అన్నాడు కార్తీక్.

"అంత ధైర్యం వచ్చిందా వాడికి! వాణ్ణి పూరికే వదల్రా! చూడండి వాడికేం గతి పడుతుందో!" పిడికిలి బిగిస్తూ ఆవేశంగా అన్నాడు వసుధేశ్.

* * *

"తనను అవమానించిన సుజాతకు, తనతో పోటీ చేయబోయే సుమంత్‌కు ఒకేసారి, ఒకే దెబ్బతో బుద్ధి చెప్పాలి! ఒకే దెబ్బకు రెండు పిట్టలు చావాలి!" మందు పార్టీలో నాలుగో పెగ్ లాగిస్తూ ప్రతిజ్ఞ చేశాడు వసుధేశ్.

వసుధేశ్ చేతుల్లో పథకం పూర్తయింది.

సుమంత్ వాడే లెటర్‌పాడ్ లోంచి ఒక కాగితం దొంగిలించి తెచ్చాడు వో మిత్రద్రోహి. దానిపై సుమంత్ పేరుతో సుజాతకు - ఆమె పెదవులు, చెంపలూ ఇలా ఒక్కొక్కటి వర్ణిస్తూ - మాంచి ప్రేమలేఖ రాసి పోస్ట్ చేశాడు వసుధేశ్.

"సుజాతకు అసలే ముక్కుమీద కోపం. లవ్ లెటర్ అందగానే సుమంత్ కాలర్ పుచ్చుకుని నాలుగు అంటిస్తుంది. ఆ అల్లరికి నలుగురూ పోగయి కారణం అడుగుతారు. అప్పుడా లెటర్ చూపిస్తుంది. ఆమె అందాన్ని నలుగురిలో గట్టిగా వర్ణిస్తూ చదివే అవకాశం మనకి లభిస్తుంది. దాని పొగరణుగుతుంది. తర్వాత కాలేజీలో తలెత్తుకు తిరగలేక చావాలి!" కసిగా అన్నాడు వినయ్.

"ఇలా తోటి విద్యార్థినులను అగౌరవ పరుస్తూ, ప్రేమ లేఖలు రాసేవాడికి ప్రెసిడెంట్ అయ్యే అర్హత వుందా అంటూ యాగీ గొడవ చేస్తాం. వాడు ఢామ్మని ఓడిపోతాడు ఎన్నికల్లో!" అన్నాడు కార్తీక్.

"ఈ దెబ్బతో రెండు పిట్టలు నేలకూలుతాయి! ఎలా వుంది మన ప్లాన్!" మీసం దువ్వుతూ అన్నాడు వసుధేశ్.

"వండర్‌ఫుల్! ఛీర్స్!" అంటూ ఆ ముగ్గురూ బీర్ బాటిల్స్ గొంతుల్లోకి ఎత్తారు.

* * *

లెటర్ పోస్ట్ చేసి వారమయింది. పది రోజులయింది. జరుగరానిది ఏమీ జరుగలేదు. ఎన్నికల్లో సుమంత్ గెలిచాడు.

ఒకనాడు వసుధేశ్ హాస్టల్ 'రూమ్'లో కూర్చున్నప్పుడు సుమంత్, సుజాత కలిసి స్కూటర్ మీద వచ్చారు అతని దగ్గరికి.

"వచ్చే నెల పదిహేనో తేదీ మా పెళ్ళి. పాత కక్షలన్నీ పెట్టుకోకుండా మీరంతా తప్పక రావాలి!"



అన్నారు సుమంత్, సుజాత కలిసి ఇన్విటేషన్ అందచేస్తూ. అర్థంకానట్టు చూశాడు వసుధేశ్.

"అసలు గమ్మత్తుగా మా పెళ్ళి కుదిరింది. నాకు సుజాత అంటే ఇష్టమే. సుజాతకు నేనంటే కూడా అంతే! కాని ఆ విషయం చెప్పడానికి ధైర్యం చాల్లేదు మాలో ఎవ్వరికీ. మహానుభావుడెవరో పాపం! వాడికి చేతులెత్తి నమస్కరించాలి. నా పేరు మీద సుజాతకు ప్రేమలేఖ రాశాడు. అది నాదే అనుకుని సుజాత నాకు రాసింది. అలా ముందుకు సాగిన మా ప్రేమ పెళ్ళికి దారితీసింది. చాలా విచిత్రంగా వుంది కదూ వింటుంటే!"

అంటున్న సుమంత్ మాటలకు వసుధేశ్ మూర్ఛపోయాడు!